క్లుప్తంగా

పశువుల నుంచి పంటలను రక్షించండి

పెదకూరపాడు: అసలే ఆశించిన స్థాయిలో దిగుబడి లేదు.... గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు.... పంట పొలంలోనే ఉంది... ఈ సమయంలో పశుపోషకులు కాపలా ఉండకుండా వదిలేయటంతో పంటను పశువులు తింటున్నాయి. మండలంలోని బుచ్చియ్య పాలెం గ్రామ రైతులు శనివారం పెదకూరపాడు ఎస్సై గిరిబాబుకు దీనిపై ఫిర్యాదు చేశారు. మిరప, మొక్కజొన్న, ఇతర ఆహార పంటలు పొలంలోనే ఉన్నాయన్నారు. ఈ సమయంలో పశువులను అడ్డగోలుగా వదిలేయడంతో పంటలను నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

164 మంది దరఖాస్తుదారులు హాజరు



అచ్చంపేట: వివిధ కార్పోరేషన్ల ద్వారా పరిశ్రమలు స్థాపించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన క్రెడిట్ క్యాంపునకు 164 మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. వీరంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా పలు బ్యాంకుల మేనేజర్లతోపాటు ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు ఇంటర్వ్యూ చేశారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకుల ద్వారా సబ్సిడీపై వీరికి రుణాలు ఇవ్వనున్నారు.

సెలవు రోజుల్లోనూ ఆస్తి పన్ను చెల్లించే అవకాశం

సత్తెనపల్లి: పట్టణంలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను ఆదివారం, సోమవారం కూడా చెల్లించే అవకాశం పురపాలక సంఘం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ శనివారం తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన 50 శాతం వడ్డీ రాయితీ ఈ నెల 31వ తేదీతో ముగుస్తుందన్నారు. ఈ నెల 26, 27వ తేదీల్లో మొత్తం 390 మంది రూ. 23.80 లక్షలు చెల్లించారన్నారు. ఈ నెల 28న సాయంత్రం ఐదు గంటల వరకు 157 మంది రూ. 8.65 లక్షలు చెల్లించారని తెలిపారు. మిగిలిన బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షేక్ సిలార్‌షాకు ప్రతిభా అవార్డు



క్రోసూరు: క్రోసూరులోని శ్రీ పద్మావతి ఇంగ్లిషు మీడియం పాఠశాల హెచ్‌ఎం, సోషల్ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న షేక్ సిలార్‌షా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపిక య్యారు. ప్రయివేటు ఉపాధ్యాయులు, లెక్చరర్ల ఆర్గనైజేషన్ ఈ అవార్డుకు ఆయన్ను ఎంపిక చేసింది. ఏప్రిల్ 13న అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పురస్కారం ప్రదానం చేయనున్నారు.

రెండు బడులకు గుర్తింపు రద్దు

సత్తెనపల్లి: మండలంలో రెండు పాఠశాలలకు 2025–26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ గుర్తింపు పునరుద్ధరించలేదని మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవిలో గల సెయింట్ జోసెఫ్ అప్పర్ ప్రైమరీ స్కూల్, కొమెరపూడిలోని ఇండియన్ ఐకాన్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లకు 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు చేసుకోవడానికి వీలు లేదన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలని ఎంఈవో పేర్కొన్నారు.

నేడు సాయిబాబా మందిరం వార్షికోత్సవం

క్రోసూరు: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరం 25వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అన్నదానం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకల నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఇఫ్తార్ విందు



రాజుపాలెం: మండలంలోని ఇనిమెట్లలో రంజాన్ మాసం పురస్కరించుకుని ఎస్‌కే సిలార్‌బీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జెల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతా శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ మర్రి సుబ్బారెడ్డి, సర్పంచ్ సైదు హుస్సేన్, పాలువాయి ఆదినారాయణ, ఒట్టి శివారెడ్డి, షేక్ ఇమామ్‌వలి తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన రంజాన్ తోఫా

రంజాన్ సమయంలో ముస్లింలకు గతంలో ఇచ్చిన సరకుల కంటే అధికంగా అందించి వారు సంబరంగా పండగ చేసుకునేలా చేస్తాం.... ఇవీ కూటమి నేతలు ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు. సూపర్ సిక్స్ పథకాల తరహాలో రంజాన్ తోఫాను సైతం కూటమి ప్రభుత్వం అటకెక్కించింది.

- కేవలం బియ్యం, చక్కెరతోనే సరి
- ముస్లింలను మరోసారి మోసగించిన కూటమి ప్రభుత్వం



నిత్యావసర సరకులు

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం ముస్లింలకు రంజాన్ తోఫా ఇవ్వడం లేదు. పండగ వచ్చేసినా అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. ఈ పండగను ఆనందంగా జరుపుకోవాలని భావించిన పేద ముస్లిం కుటుంబాలను కూటమి సర్కార్ నిలువునా మోసం చేసింది. ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ పర్వదినాలు వెంట వెంటనే వస్తున్నాయి. దీంతో రేషన్ లబ్ధిదారులు తమకు అన్ని రకాల వస్తువులు ఇవ్వాలని డిమాండ్ చేసినా పట్టించుకునే వారే కరవయ్యారు. చక్కెరతోపాటు కందిపప్పు, నూనె, ఇతర నిత్యవసరాలు ఇవ్వాలని కోరుతున్నా కేవలం సంక్రాంతి పండుగ సమయంలో మాత్రమే అరకొరగా కందిపప్పు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకొంది.

ఇచ్చే ఉద్దేశం లేక...

నిజానికి రంజాన్ తోఫా ఇవ్వాలంటే అందులో రెండు కిలోల చక్కెర, 5 కిలోల గోధుమపిండి, కేజీ సేమియా, వంద గ్రాముల నెయ్యి ఉండాలి. దీనికి సంబంధించి టెండర్లు పిలిచి ముందుగానే విడివిడిగా ప్యాకింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ అలాంటిదేమీ జరగలేదు. ఈ ప్రక్రియ జరగాలంటే కనీసం నెల నుంచి రెండు నెలల సమయం పడుతుంది. ఇచ్చే ఉద్దేశం లేకనే దీనిపై ఎటువంటి ప్రక్రియ చేపట్టలేదని పలువురు విమర్శిస్తున్నారు. అలాగే కందిపప్పు సరఫరా లేకపోవడంతో గ్రామాల్లో రేషన్ వాహనదారులు, డీలర్లు లబ్ధిదారులకు సమాధానం చెప్పలేక విసుగెత్తి పోతున్నారు. కందిపప్పు మార్కెట్లో సుమారు కిలో రూ.150 పైనే పలుకుతోంది. అదే చౌక దుకాణాల్లో అయితే కిలో రూ. 67 కే లభిస్తుండడంతో లబ్ధిదారులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. మరోపక్క ఇంటిల్లిపాదీ పాయసం చేసుకోవాలన్న కేజీపైగానే చక్కెర అవసరం ఉంటుంది. కానీ ప్రభుత్వం అర కేజీ ఇస్తుండడంతో బయట దుకాణాల్లో తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే కానుకలు అందజేస్తే తమకు పండుగ వేళ భారం తగ్గేదని లబ్ధిదారులు చెబుతున్నారు. ఈ నెలలో కనీసం కందిపప్పు కూడా ఇవ్వకపోవడంతో ఉగాది, రంజాన్ ఎలా జరుపుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది.

నిత్యావసరాల ధరలు పైపైకి..

ఉగాది, రంజాన్ పర్వదినాలకు ప్రతి ఒక్కరూ తమ కుటుంబాల్లో పిండి వంటలు చేసుకోవడం ఆనవాయితీ. అలాగే బంధుమిత్రులను ఆహ్వానించి వారికి పిండి వంటలతో పాటు విందులు ఇవ్వడం సహజం.

ఈ క్రమంలో నిత్యవసరాల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పండుగలు ఎలా జరుపుకోవాలని పేదలు మథన పడుతున్నారు. శనగ, కందిపప్పు, బెల్లం, నూనె ధరలు అమాంతం పెరిగి సామాన్యుడి జీవనంపై భారం మోపుతున్నాయి. నూనె ధరలు కంపెనీని బట్టి లీటరు రూ. 130 నుంచి రూ.170 వరకు విక్రయిస్తున్నారు. దీంతో ఉగాది, రంజాన్ పర్వదినాలకు పిండి వంటలు చేసుకుని తినడం కష్టమేనని పలువురు వాపోయారు.

ఊసే లేని కొత్త కార్డుల ప్రక్రియ...

కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. ఉన్న కార్డుదారులకు సక్రమంగా సరకులు ఇవ్వలేకపోయింది. కొత్త కార్డులు రాకపోవడంతో నూతనంగా పెళ్లి అయిన దంపతులు, సంతానానికి సంబంధించిన చేరికలు, వివిధ పథకాలకు వర్తించేందుకు అవసరమైన ధ్రువపత్రాలు కష్టమవుతోంది. మరోవైపు ఈ–కేవైసీ అంటూ హడావుడి పెట్టడంతో సర్వర్ సతాయిస్తూ పేదలు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది.

ఈ–కేవైసీ గడువు పొడిగింపు



ముప్పాళ్ల: ప్రభుత్వం రేషన్ కార్డుదారుల ఈ–కేవైసీ ప్రక్రియను ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించిందని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ శనివారం తెలిపారు. కార్డులోని అందరూ ఈ–కేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు. మండలంలోని ఇరుకుపాలెం, దమ్మాలపాడు, బొల్లవరం, మాదల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఈ–కేవైసీ నమోదు ప్రక్రియను డిప్యూటీ తహసీల్దార్ పరిశీలించారు. ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

రీసర్వేపై అవగాహన ర్యాలీ



అమరావతి: మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలో శనివారం రైతుల భూముల రీసర్వేపై అవగాహన కల్పించటం కోసం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. రీసర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ డానియల్ రైతులకు వివరాలు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది, రైతులు కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాయుడు రాంబాబు, మండల సర్వేయర్ పాల్గొన్నారు.

కాన్పులన్నీ వైద్యశాలల్లోనే నిర్వహించాలి



రాజుపాలెం పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ గీతాంజలి

రాజుపాలెం :వంద శాతం కాన్పులు ఆసుపత్రిలోనే జరిగేలా చూడాలని 0జిల్లా ఇమ్యునేషేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పల్నాడు జిల్లా డాక్టర్ బి.గీతాంజలి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్ గదిని, ఫార్మసీ గదిని పరిశీలించారు. రోజువారీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రవితేజనాయక్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక



మనశ్రీని అభినందిస్తున్న ఎంఈవోలు



పల్లపాటి తేజమణి శ్రీకాంత్

రాజుపాలెం: మండల కేంద్రంలోని నవోదయ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న బండారు మనశ్రీకి జవహర్ నవోదయ పాఠశాలలో 7వ తరగతిలో సీటు వచ్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రత్తి రామారావు శనివారం తెలిపారు. గణపవరం శ్రీచైతన్య పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న పల్లపాటి తేజమణిశ్రీకాంత్‌కు జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు సీటు వచ్చినట్లు తెలిపారు. మనశ్రీకి ఎంఈవో 1,2 బి.మల్లికార్జునశర్మ, నరసింహారావులు అభినందనలు తెలిపారు.

సహజ ఉత్పత్తులతో భావితరాలకు మేలు



ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలు వివరిస్తున్న తహసీల్దార్ కె.పుల్లారావు

నకరికల్లు: ప్రకృతి వ్యవసాయ విధానం ఆచరించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యం సిద్ధిస్తుందని తహసీల్దార్ కె.పుల్లారావు అన్నారు. మండలంలోని నర్సిగపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తీసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

సమాజంలో పేరుకుపోతున్న దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ప్రకృతి ఆహారం సమాధానమన్నారు. మాస్టర్ ట్రైనర్ బాజీ మాట్లాడుతూ నవధాన్య విధానంలో భూసారం పెరగడంతో పాటు చీడపీడలు తట్టుకునే శక్తి పంటలకు పెరుగుతుందని అన్నారు. ఖరీఫ్‌యాక్షన్ ప్లాన్‌లో భాగంగా భూమిలేని పేదలకు 365 రోజులు ఆదాయాన్నిచ్చే కిచెన్ గార్డెనింగ్ మోడల్‌పై శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులకు ఘనసన్మానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కొండారెడ్డి, గ్రామ కార్యదర్శి కొమ్మవరపు అప్పారావు, గ్రామ వ్యవసాయాధికారి అహ్మద్, వీటీఏ రాజేశ్వరి, డీఎంఎంటీఎస్‌లు రవికుమార్, హసీనా, ఐసీఆర్‌పీ విజయలక్ష్మి, రైతులు రవీంద్రారెడ్డి, చంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా సిబ్బంది అప్పరాజు, సైదయ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఇంటి అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు

అమరావతి: మండల పరిధిలోని మునగోడు గ్రామంలో ఉన్న తన ఇంటిని గలబా రాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని గనపా ఉషారాణి శనివారం ఆరోపించారు. నరసరావుపేట జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలన్నారు.

ముందస్తు ఉగాది వేడుకలు



కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఉగాది వేడుకల్లో విద్యార్థులు



బోధి పాఠశాలలో ఉగాది వేడుకలు

మాచర్ల: ముందస్తు ఉగాది పండుగ వేడుకలను పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, నారాయణ,కిడ్స్ స్కూళ్లు, పల్నాడు జూనియర్, కృష్ణవేణి జూనియర్ కాలేజీల్లో శనివారం నిర్వహించారు. విద్యా సంస్థల నిర్వాహకులు డాక్టర్ శివ, పఠాన్ నాగూర్‌వలి, ఉల్లా రెడ్డి, వై.వెంకట్రామయ్యతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించారు.

అలరించిన చిన్నారులు

పిడుగురాళ్ల: మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలోని బోధి పాఠశాలలో శనివారం ముందస్తు ఉగాది, రంజాన్ పండగలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో నృత్యాలు, పాటలు, నాటకాలు ప్రదర్శించి సంబరాలు చేసుకున్నారు.కరస్పాండెంట్ సునీతారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సాంప్రదాయలపై గౌరవం పెరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, విద్యాలయాలపై ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ కల్యాణ్‌రామ్ పాల్గొన్నారు.

వైభవంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉగాదిని పురస్కరించుకొని ఆలయ శుద్ధి చేపట్టారు. వేకువజామున సుప్రభాతం, అర్చన సేవల అనంతరం శ్రీవారి మూల మూర్తికి ఆలయ ప్రధాన అర్చకులైన చిత్రకవి శ్యాము ఆచార్య రామానుజ స్వామి పట్టు వస్త్రంతో పూర్తిగా కప్పివేశారు. సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలంతో ప్రదక్షిణగా వెళ్లి ఆలయ శుద్ధి చేపట్టారు. అనంతరం స్వామి వారిపై కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పించారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజన కార్యక్రమానికి, నారాయణ సేన నగర సంకీర్తన బృందం, కోలాట మహిళ భక్త బృందం, ఆలయ ధర్మకర్తలు హాజరయ్యారు. వారికి అర్చకులు శ్రీవారి మంగళాశాసనలు అందజేశారు.

3న రుణ అర్హత మేళా

నకరికల్లు: జనరిక్ ఫార్మసీ లబ్ధిదారుల కోసం ఏప్రిల్ 3వ తేదీన ఎంపీడీఓ కార్యాలయంలో రుణ అర్హత మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ జి.కాశయ్య శనివారం తెలిపారు. ఎంఎస్ఎంఈ కింద స్వయం ఉపాధిలో భాగంగా 2024–25కు గాను వెనుకబడిన తరగుతుల అభ్యున్నతే ధ్యేయంగా రుణాల మంజూరుకు రుణమేళా జరుగుతుందని అన్నారు.

మహిళపై దాడి... కేసు నమోదు

పెదకూరపాడు: పాత కక్షల నేపథ్యంలో మహిళపై రోకలి బండతో దాడి చేసిన సంఘటన పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెదకూరపాడు ఎస్సై గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం... లగడపాడు గ్రామానికి చెందిన గండికోయ రాహేలు తన కుమార్తె జ్యోతిని ఇదే గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. కొంతకాలంగా కుమార్తె జ్యోతి అత్తారింటితో వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 8న కుమార్తె అత్తింటి వారి బంధువులు ఇంటూరి సూరిబాబు, భారతీరాణి, మోహన్ రావు, బుజ్జి, చిట్టెమ్మలు రాహేలుతో దుర్భాషలాడుతూ రోకలి బండతో దాడి చేశారు. బాధితురాలు అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నారు. శనివారం పెద్దకూరపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై గిరిబాబు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ చార్జీల భారం దారుణం



ఏఈ రవికిరణ్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అమరావతి: విద్యుత్తు చార్జీలు విపరీతంగా పెంచి ప్రజలపై భారం వేయటం దారుణమని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం అమరావతి విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.సూరిబాబు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, సెకీ ఒప్పందాన్ని రద్దు చేస్తామని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయబోమని చెప్పారన్నారు. అధికారంలోకి రాగానే మాట మార్చారని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేదని పేర్కొన్నారు. ప్రజలు తమ పార్టీ చేసే పోరాటాల్లో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ రవికిరణ్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రూరల్ కార్యదర్శి ఎస్‌డీ మొహిద్దీన్‌వలి, సీహెచ్ మురహరి, తోకల సూరిబాబు, దారా ప్రసాదు, ఎస్‌కే రఫీ పాలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రణాళికపై శిక్షణ



మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ రమా

పెదకూరపాడు:ప్రతి మహిళ ఆర్థికస్వావలంబన సాధించేందుకు ఆర్థిక ప్రణాళికలు అవసరమని సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ రమా అన్నారు. పెదకూరపాడులో 2025–26 సంవత్సరం ఆర్థిక ప్రణాళికపై మండలంలోని 36 గ్రామ సమాఖ్యలలో ఎంపిక చేయబడిన ఐదుగురు యానిమినేటర్లకు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. మండలంలో మొత్తం 1135 స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక విధివిధానాల ప్రణాళికలు తయారీపై అవగాహన కల్పిస్తున్నట్లు రమా తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే శిక్షణలో యాప్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. వారి అవసరాలను బట్టి ఆర్థిక ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఆఫీసు నుంచి మూర్తి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రజిని, జిల్లా కార్యదర్శి నాగలక్ష్మి, జిల్లా యాంకర్ పర్సన్ జీవన్, మండల సమాఖ్య అధ్యక్షురాలు శివరంజని, ఏపీఎం బొబ్బ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త ఏడాది మున్సిపల్ అభివృద్ధికి కృషి చేద్దాం

పురపాలక సంఘ చైర్మన్ పోలూరి నరసింహారావు



మాచర్ల: తెలుగు సంవత్సరాది ఉగాది సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో మరింత పురపాలక సంఘ అభివృద్ధికి సమష్టిగా కృషి చేసి, మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజల ఆమోదం పొందడానికి కలిసికట్టుగా పనిచేద్దామని పురపాలక సంఘ చైర్మన్ పోలూరి నరసింహారావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పురపాలక సంఘ సాధారణ సమావేశం చైర్మన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగింది. మొత్తం 8 అంశాలు ప్రవేశపెట్టగా ప్రతి అంశం పై మాట్లాడి ఏకగ్రీవంగా ఆమోదించారు. పీఎస్ఆర్ అంజనేయులు మీనాక్షి, రోటరీ, లయన్స్ విజన్ చారిటబుల్ ట్రస్టు ఆసుపత్రికి పన్నులకు సంబంధించి రూ.22లక్షల మినహాయింపు, మెట్టు గోవిందరెడ్డి స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే బిల్డింగ్ అనుమతులు, 15, 30 వార్డులో నూతనంగా చేపట్టేందుకు అవసరమైన పని అంతకు ముందే అనుమతులిచ్చామని, అనుమతులిచ్చినందువలన దానిని వాయిదా వేయాలని కౌన్సిలర్ షేక్ సుభాని కోరారు. ఈ మూడు అంశాలకు సంబంధించి వచ్చే కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకునేలా చర్చ జరిగింది. ఎండాకాలంలో చలివేంద్రాలకు సంబంధించి ఏర్పాటు చేసే చలివేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రజలకు ఉపయోగపడేలా రూ. 2 లక్షల బడ్జెట్ సరిపోదని, మరింతగా పెంచాలని కౌన్సిలర్లు ఎం.శ్రీనివాసరావు, గట్ల అరుణ కుమారి, షేక్ సుభాని కోరారు. పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకుంటామని చైర్మన్ నరసింహారావు సమాధానం ఇచ్చారు. అదే విధంగా గతంలో కోవిడ్‌లో చేరి దాదాపుగా సంవత్సరం పైగా వేతనాలు రాని 28 మంది కాంట్రాక్టు బేస్ వర్కర్లకు వేతనాలు చెల్లించేందుకు కౌన్సిల్ లో చర్చ జరిగింది. కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయడానికే కౌన్సిల్ చర్యలు తీసుకుంటుందన్నారు. అంబేద్కర్ పార్కు అభివృద్ధికి, జయంతి సందర్భంగా రూ. లక్ష కేటాయించి, చెట్లు నాటి, పార్కు అభివృద్ధి చేసి రంగులు వేసేందుకు సాధారణ ఖర్చుల నుంచి అనుమతించారు. అదే విధంగా నూతనంగా 25 మంది కాంట్రాక్టు బేస్డ్‌లో సంవత్సరం పాటు నాన్ పీహెచ్ వర్కర్లు, పబ్లిక్ హెల్త్ వర్కర్లు తీసుకునే విధంగా తీర్మానం చేశారు. కౌన్సిలర్లు పోలా శ్రీనివాసరావు, గట్ల అరుణ కుమారి, శ్యామలా జ్యోతి, ఎం.శ్రీనివాసరావు, తేరాల సిద్దమ్మ, షేక్ దస్తగిరి, గెల్లెపోగు జగన్నాధం, పురపాలక సంఘ అధికారులు డీఈ షేక్ సుభాని, ఏఈ గౌతమి, విద్యుత్ శాఖ ఎఈ కోటేశ్వరరావు, ఆర్ఓ సాంబశివరావు, ఆర్ఐ వెంగయ్య, మెప్మా ప్రాజెక్టు తరఫున సీఓ రాజశేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పండగలకు సౌకర్యాలు కల్పించండి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. శ్రీరామ నవమి సందర్భంగా పట్టణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని 23వ వార్డు కౌన్సిలర్ జూలకంటి శ్రీరంగ రజని కౌన్సిల్ దృష్టికి తీసుకొని వచ్చారు. రంజాన్ పండగను సందర్భంగా ఈద్గాలలో టెంట్లు, మంచినీటితోపాటు నమాజ్ చెదువుకునేందుకు సౌకర్యాలు కల్పించాలని ముస్లిం కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు స్పందించి ఏర్పాట్లు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని సూచించారు. చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. వేసవిలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అలాగే పట్టణాభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగే సమయంలో గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.